ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 | సంచిక : 04 | డిసెంబరు 2018

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు|| 150/-
విడి ప్రతి : రు|| 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

04-12-1987
శృంగవృక్షం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-12-1987, శృంగవృక్షం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు బ్రహ్మదేవుడికి విష్ణుదేవుడికి ఈశ్వరుడు జ్యోతి రూపంలో దర్శనం ఇచ్చినటువంటి రోజు. ఎందుకు దర్శనం ఇచ్చాడు? బ్రహ్మదేవుడికి విష్ణుదేవుడికి దర్శనం ఇవ్వవలసినటువంటి అవసరం ఏమొచ్చింది ఈశ్వరుడికి ఈరోజున అంటే - మన ఇంటిలోనైనా మన ఊరిలో అయినా మన దేశంలో అయినా ప్రపంచంలో అయినా అశాంతికి అల్లకల్లోలానికి కారణం మానవుడి యొక్క అహంకారం. మరి ఎవరో ఒక ఇంటిలోనో ఒక గ్రామంలోనో ఒక దేశంలోనో నలుగురికి అహంకారం ఉంటే ఇంత ఉపద్రవం పుడుతూవుంటే, బ్రహ్మ దేవుడికి విష్ణుదేవుడికి అహంకారం వస్తే మొత్తం లోకం అంతా కల్లోలం అయిపోయింది. బ్రహ్మదేవుడికి విష్ణుదేవుడికి అహంకారం వచ్చింది. వాళ్ళ అహంకారం లోకానికి కల్లోలం తీసుకొచ్చింది. లోకానికి అశాంతి తీసుకొచ్చింది. ఈ రోజున బ్రహ్మ విష్ణువుల యొక్క అహంకారాన్ని తొలగించటంకోసం ఈశ్వరుడు జ్యోతిస్తంభ రూపంలో దర్శనం ఇచ్చాడు కాబట్టి, దానికి గుర్తుగా ఈరోజున అరుణాచలంలో దీపం వెలిగిస్తారు.

మన దుఃఖానికి కారణం కూడా అహంకారమే. మన హృదయంలో ఉన్న దైవస్వరూపాన్ని ఆత్మస్వరూపాన్ని, మోక్షాన్ని మనకి దొరకకుండా చేసేది మన అహంకారం! ఎవరో దేవుడు కాదు. మనం ఏమి చేస్తున్నాము అంటే, ఈ అహంకారాన్ని సూటిగా వెదకటం మానేసి, దేనివల్ల మనకి అశాంతి వస్తోందో, దేనివల్ల మనకి దుఃఖం వస్తోందో, దేనివల్ల మనకి కష్టమూ, నష్టమూ ఇవన్నీ వస్తున్నాయో, దాన్ని మనం

సూటిగా ఎదుర్కోలేక, సూటిగా వెదకటం మానేసి, ఈ అహంకారం కల్పించిన వస్తువులని వెదుకుతున్నాము. లోపలికి దిగటం మనకు చేతకాదు, అందుచేత బయట వెదుకుతున్నాము.

రమణస్వామి ఈశ్వరుడికి శరణాగతి పొందాడంటే ఇక్కడ ఈశ్వరుడు అంటే ఆ కొండా కాదు, ఆ లింగమూ కాదు. సర్వాంతర్యామిగా ఉన్నటువంటి, చైతన్యరూపంలో ఉన్నటువంటి పరబ్రహ్మముకే ఆయన శరణాగతి పొందాడు. ఆత్మ అంతటా ఉన్నది, సర్వాంతర్యామి. అంతటా వ్యాపించి ఉంది. సర్వజ్ఞత్వం - దానికి మొదలు చివరా లేదు. ఈశ్వరతత్వానికి ఆరంభమూ ముగింపూ అంటూ లేవు. అయితే మనం దేహమాత్రులము కాబట్టి, ఈశ్వరుడికి కూడా ఒక విగ్రహము చేసి, దానిని చూడటం మనకి అలవాటు అయిపోయింది. మనందరికీ దేహం ఉంది, మనకి లోకం ఒకటి కనిపిస్తోంది. ఈ దేహం లేకుండా లోకాన్ని చూసినవాళ్ళు ఎవరైనా ఉన్నారా?

ఉన్నది నలుబది సద్విద్య అని భగవాన్ కొన్ని మాటలు చెప్పారు. ఆ మాటలు కొన్ని చదివి మీకు వినిపిస్తాను. నేను అని ఈ దేహము పలుకదు - మనందరమూ నేను నేను అని అంటున్నాము. మనం ఏదైతే నేను నేను అంటున్నామో, ఈ నేనే మనస్సు, ఈ నేనే అహంకారము, అంతా ఈ నేను మీదే ఆధారపడి ఉంది. మనందరం నేను, నేను అంటున్నాము కదా! ఈ నేను అని దేహం మటుకు అనటం లేదు. మరి ఎవరు అంటున్నారు? నాలో ఉన్న మనస్సు అనండి, లేకపోతే అహంకారం అనండి, లేకపోతే బుద్ధి అనండి, ఏదో ఒకటి నేను అంటోంది లోపలినుంచి. కానీ దేహం అనటంలేదు నేను నేను అని. అందరం నేను అంటున్నాము. అసలా నేను ఎవరో మనకి తెలియదు. ఆ నేను యొక్క సోర్స్ తెలుసుకొనేవరకు ఈ శవాలు వస్తూ ఉంటాయి అని భగవాన్ చెప్పారు. ఈ నేను, నేను అని అందరం అంటున్నాం. దీనికి మీరు నాస్తికులా, ఆస్తికులా అన్న సమస్య ఏమీ లేదు. మనందరమూ నేను నేను అని అంటున్నాము. ఈ నేను యొక్క సోర్స్ ఒకటి ఉంది లోపల. ఆ మూలాన్ని తెలుసుకొనేవరకు మీరు ఏ దేవుడిని చూసినా మీకు అజ్ఞానం పోదు. మీరు దేవుడిని చూడటం ప్రధానం కాదు, ఏవో మహిమలు సంపాదించటం ప్రధానం కాదు, ఏదో శక్తులు సంపాదించటం ప్రధానం కాదు. ఈ నేను నేను అని ప్రతీ మనిషి అంటున్నాడు, ఈ నేను యొక్క మూలం మీ హృదయంలోనే ఉంది. ఆ హృదయంలో ఉన్నటువంటి నేను యొక్క మూలాన్ని నువ్వు గ్రహించు. అప్పుడు నీకు ఆత్మ దర్శనం అవుతుంది. అంతేకానీ ఆ నేను యొక్క మూలాన్ని చూడకుండా నేను దేవుడిని చూసాను, ఎక్కడో లోకానికి వెళ్ళొచ్చాను, అంటే అదంతా నిజం కాదు, అది స్వప్నం మాత్రమే! అదీ

రమణస్వామి చెప్పింది. ఆ నేను యొక్క మూలం కనుక మీకు తెలియకపోతే, మీకు దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది. మిమ్మల్ని దేహాలు వెంటాడుతూనే ఉంటాయి, మీకు పునర్జన్మ తప్పదు, మరణించటం తప్పదు మళ్ళీ జన్మించటం తప్పదు. ఎప్పటివరకూ అంటే, ఆ నేను యొక్క మూలం తెలుసుకునే వరకూ.

ఇక్కడ భగవాన్ ఏమని చెపుతున్నారు అంటే నేను అని ఈ దేహము పలుకదు. దేహం జడం, కానీ ఇది నేను అని ఎప్పుడూ చెప్పటం లేదు. మనం గాఢనిద్ర పోతున్నాము, గాఢనిద్రలో ఉన్నప్పుడు కూడా ఈ నేను ఉంది. అప్పుడు మనకి దుఃఖం లేదు, బంధం లేదు. గాఢనిద్రలో కూడా నేను ఉంది. అందుచేత మనకి జాగ్రదావస్థలోకి వచ్చాక, నాకు బాగా నిద్ర పట్టింది, రాత్రి నాకు స్వప్నం రాలేదు, నాకు చాలా సుఖంగా ఉంది అని మనం చెపుతున్నాము. అంటే అక్కడ నేను ఒకటి చూస్తోంది. అక్కడ లోకం లేదు, అక్కడ దేవుడు లేడు, అక్కడ శరీరం లేదు, అక్కడ బంధువులు లేరు, బంధాలు లేవు, నరకం లేదు, స్వర్గం లేదు, ఏ లోకాలూ లేవు, గురువులు లేరు, శిష్యులు లేరు, ఎవరూ లేరు! కానీ గాఢనిద్రలో మీరు ప్రశాంతంగా ఉన్నారు, మీకు దుఃఖం లేదు! నిద్రలో ఏమీ లేదు, కానీ మీరు ఉన్నారు. మీరు లేరు అని చెప్పగలరా? మీరు లేకపోతే, మెలకువ వచ్చాక నాకు బాగా నిద్ర పట్టింది అని ఎవరు చెపుతున్నారు? అందుచేత నిద్రలో కూడా మీరు ఉన్నారు.

నేను ఒకటి పుట్టిన వెనుక అఖిలము పుట్టును - ఉదయం మనం లేవగానే దేహానికి సంబంధించిన నేను అనే తలంపు వస్తుంది. ఆ దేహ స్పృహ వచ్చిన తరువాత లోకం వస్తుంది. అక్కడినుంచి ప్రార్థనలు, పూజలు, దేవుడు, ఇవన్నీ వస్తాయి. అందరూ కూడా నిద్రపోతున్నారు. నిద్రపట్టకపోతే ఫ్యాన్లు వేసుకొంటున్నాం, నిద్రకోసం పరుపులు మీద పడుకుంటున్నాం, ప్రతి వ్యక్తీ కూడా నిద్రలో మీకు తెలియకుండా మీరు సుఖాన్ని అనుభవిస్తున్నారు. మీకు తెలియకుండా మీరు మీ మూలానికి వెళ్తున్నారు. నువ్వు నిద్రలో ఎలా ఉండగలుగుతున్నావో, అది నువ్వు తెలియకుండా ఉన్నావు. తెలిసి నువ్వు జాగ్రదావస్థలో అటువంటి స్థితిలోకి రా, అప్పుడు కదా నీకు జ్ఞానం కలిగేది, సమాధిస్థితి కలిగేది.

ఇక్కడ భగవాన్ ఏం చెపుతున్నారంటే, నేను లేనని ఎవరూ చెప్పటం లేదు, నేను ఒకటి పుట్టిన వెనుక అఖిలము పుట్టును - ఈ నేను అనే తలంపు వచ్చిన తరువాతే ఈ లోకం వస్తోంది. ఈ నేను ఎక్కడ పుడుతోంది, అది నీ బుద్ధిచేత శోధించు. అంటే మనస్సుని అంతర్ముఖం చెయ్యి. మనం చేసే పూజల వల్ల, మనం చేసే జపాల వల్ల, మనం

చేసే ధ్యానం వల్ల మనస్సు అంతర్ముఖం అవ్వాలి. మనస్సు సూక్ష్మం అవ్వాలి. మనస్సుని అంతర్ముఖం చెయ్యటం అంటే, ఎలా చెయ్యగలరు? పుణ్యకార్యాలు చెయ్యటం వల్ల, త్యాగబుద్ధి ఉండటం వల్ల, పవిత్రంగా జీవించటం వల్ల, ఇంద్రియనిగ్రహం వల్ల, మనోనిగ్రహం వల్ల, మనస్సు అంతర్ముఖం అవుతుంది. ప్రతీ మనిషికీ సుఖం కావాలి, ప్రతీ మనిషికీ శాంతి కావాలి. కానీ శాంతి లోకంలోంచి వస్తుంది అనుకొంటున్నాము, లోకంలోంచే సుఖం వస్తుంది అనుకొంటున్నాము. అందుచేత లోకాన్ని చూసి మనం ఆకర్షింపబడుతున్నాము. మనం ఎవరమూ దేవుడిని ప్రేమించటం లేదు, మనం లోకాన్నే ప్రేమిస్తున్నాము. దేవుడిని ప్రార్థించేటప్పుడు కూడా మన బుర్రలో ఉండేది లోకమే. మీరు వెంకటేశ్వరస్వామి బొమ్మో, రాముడి బొమ్మో, కృష్ణుడి బొమ్మో పెట్టుకొంటున్నారు. పెట్టుకొని, నాకు ఈ కోరిక కావాలి, ఆ కోరిక కావాలి, ఇవి నెరవేర్చు అవి నెరవేర్చు, అని మీరు ప్రార్థిస్తున్నారు ఈశ్వరుడిని. అలా ప్రార్థించేటప్పుడు మీకున్న కోరికలనే మీరు మననం చేస్తున్నారా లేకపోతే వెంకటేశ్వర స్వామిని ధ్యానం చేస్తున్నారా? మీ కోరికలని మీరు ధ్యానం చేసుకొంటున్నారు, మీ వాంఛలని మీరు ధ్యానం చేస్తున్నారు కానీ, వెంకటేశ్వరస్వామిని కాదు. అంటే ఈశ్వరుడి పట్ల నాకు భక్తిగా ఉంది అనుకొన్నప్పుడు కూడా మీరు లోకాన్నే ప్రేమిస్తున్నారు, ఈశ్వరుడిని కాదు. లోకంలో మనకున్న వాంఛలు నెరవేరటం కోసం ఈశ్వరుడిని అడ్డుపెట్టుకొని అవి నెరవేర్చమని మనం అడుగుతున్నాము. అంటే ఈశ్వరుడిని ప్రార్థించేటప్పుడు కూడా మనం మననం చేసేది లోకాన్నే.

భగవాన్ శ్రీ రమణమహర్షికి ఒక రూపంతోటి సంబంధం లేకుండా ఆయనకి ఎక్స్‌పీరియన్స్ వచ్చింది. ఆయనకి మృత్యువు వచ్చి పదహారవ సంవత్సరంలో మీద పడింది. ఆ మృత్యువు వచ్చినప్పుడు ఆయనకి శ్వాస ఆగిపోయింది, శరీరం అంతా శవం అయిపోయింది. కానీ శరీరంతో వేరుపడిపోయి పూర్తిగా సాక్షిగా చూడగలుగుతున్నాడు. ఇది పదహారవ సంవత్సరంలో ఆయనకి వచ్చినటువంటి మృత్యానుభవం. దేహానికి పరిమితమైన నేనే అహంకారం. ఆయనకి పదహారవ సంవత్సరంలో అహంకారం మరణించింది. అంటే దేహంలో శ్వాస ఉండగానే దేహానికి పరిమితమైన నేను మరణించాలి. వాడే జీవన్ముక్తుడు అవుతాడు.

అందరికీ మోక్షం కావాలి. మోక్షం అంటే ఎలా ఉంటుంది? ఎవరైనా చెపుతారా మోక్షం అంటే ఎలా ఉంటుందో? మోక్షం అనేది మనస్సుకి అతీతం. మోక్షం అనేది అహంకారానికి అతీతం. మనస్సుకి అతీతమైన దానిని, అహంకారానికి అతీతమైన దానిని

వాక్కుకి అతీతమైన దానిని, మనం మనస్సుతోటి, వాక్కుతోటి చెప్పలేము. అసలు మోక్షం అనేది మానసిక పరిధిలోనిది కాదు, దేహం యొక్క పరిధిలోనిది కాదు, అహంకారం యొక్క పరిధిలోనిది కాదు. మోక్షం అహంకారానికి అతీతమైనది, మనస్సుకి అతీతమైనది, ఇంద్రియాలకి అతీతమైనది, బుద్ధికి అతీతమైనది. అసలు ఆలోచించి చెప్పేది ఏమీ కాదది, అనుభవించేది అది. మోక్షాన్ని పొందటం కోసం మీరు శరీరం పోయేవరకూ వాయిదాలు వేసుకోనక్కరలేదు. శరీరం ఉండగానే, ఈ లోకంలోనే, ఈ దేహంలో ఉండగానే మీరు మోక్షాన్ని అనుభవంలోకి తెచ్చుకోవచ్చు. ఇప్పుడు మీరు నన్ను ఎలా చూస్తున్నారో, నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నానో అలాగే మీకు రాముడో కృష్ణుడో శివుడో వచ్చి కనిపిస్తారు అనుకోండి, అది మోక్షం కాదు, అది దృశ్యమే. ఏది మోక్షం? మీరు ఏదైతే నేను నేను అని అంటున్నారో, ఆ నేను యొక్క మూలం మీరు ఎప్పుడైతే చూసారో, ఆ నేను యొక్క మూలం ఎప్పుడైతే మీ అనుభవానికి చిక్కిందో, అప్పుడు ఆ గడియలో మోక్షం మిమ్మల్ని వరిస్తుంది. మీరు దేవుడిని చూడటం మోక్షం కాదు. ఎందుచేతనంటే, మీరు దేవుడిని చూస్తే, దేవుడిని చూసినటువంటి ఈ శరీరం ఎంతసేపు ఉంటుంది? మన కళ్ళకి కనిపిస్తున్నటువంటి దేవుడు ఎంతసేపు ఉంటాడు? పెర్మనెంట్ హేపీనెస్ మీకు కావాలంటే మీలో ఉన్న ఆ నేను యొక్క మూలం మీకు తెలియాలి. దానికి భక్తివల్లా ప్రయత్నం చెయ్యవచ్చు, జ్ఞానం వల్లా ప్రయత్నం చెయ్యవచ్చు, యోగం వల్లా ప్రయత్నం చెయ్యవచ్చు. మీకు నచ్చిన ఏదో ఒక మార్గంలో మీరు ప్రయాణం చెయ్యొచ్చు. ఏ మార్గంలో మీరు ప్రయాణం చేసినప్పటికీ, ఆ నేను యొక్క మూలం మీకు తెలియబడాలి. ఆ సోర్స్ మీకు తెలియబడాలి.

వీత రాగ భయ క్రోధ - భగవంతుడు వాసుదేవుడు చెప్పాడు రాగాన్ని విడిచిపెట్టు, భయాన్ని విడిచిపెట్టు, క్రోధాన్ని విడిచిపెట్టు అన్నాడు. ఈ నేను ఉన్నంత కాలం రాగం పోదు, క్రోధం పోదు, భయంపోదు. ఈ నేను నేను అంటున్నాము, ఈ దేహానికి పరిమితమైన నేను ఉన్నంతకాలం, రాగం విడిచిపెట్టదు, క్రోధం విడిచిపెట్టదు. నాకు దుఃఖం రావటానికి నా రాగం కారణం. భయం వేసినప్పుడు మీకు ఏమనిపిస్తుంది - నాకు భయం వేయకూడదు నాకు భయం వేయకూడదు అనుకొంటున్నారు. కారణం ఏంటి? భయం వస్తే మీకు నష్టం ఏమిటి? భయం వస్తే దుఃఖం వస్తుంది. ఈ నేను యొక్క మూలం తెలిస్తేనే కానీ ఈ రాగం వెనక్కి తప్పకోదు, భయం వెనక్కి తప్పకోదు, ద్వేషం వెనక్కి తప్పకోదు. ఈ నేను యొక్క మూలం తెలిసేవరకూ, ఈ రాగం కానీ భయం కానీ ద్వేషం కానీ, ఏదీ వెనక్కి మళ్ళవు,

విజృంభిస్తూనే ఉంటాయి. మీరు దేవుడిని ప్రార్థించటం వల్లో, లేకపోతే పది నిమిషాలు పూజ చెయ్యటం వల్లో, ఈ భయమూ ఈ రాగమూ ఈ ద్వేషమూ తాత్కాలికంగా అణిగి ఉండొచ్చునుగానీ సమస్య పరిష్కారం కాదు, అవి శాశ్వతంగా వెనక్కి మళ్ళవు.

ఈ నేను యొక్క మూలం తెలుసుకొనేవరకూ అజ్ఞానం మనిషిని విడిచిపెట్టదు. అశాంతి పీడిస్తుంది, అజ్ఞానం పీడిస్తుంది. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటంటే, భక్తి ఉంది మీకందరికీ. భక్తి ఉంది కాబట్టి మీరెంతో శ్రద్ధగా చాలా దూరాన్నుంచి వచ్చారు. భక్తి దేనికి? అంటే నేను ఇంత గొప్పవాడిని అని చెప్పకోవటానికి, లేకపోతే నేను ఇంత ప్రార్థన చేస్తున్నానని, ఇంతసేపు ధ్యానం చేస్తున్నానని ప్రకటించుకోవటానికి భక్తా? పబ్లిసిటీకా భక్తి! కాదు. భక్తి దేనికంటే ఈ నేను యొక్క మూలాన్ని తెలుసుకోవటం కోసమే భక్తి కావాలి. అహంకారంలేని స్థితిని సంపాదించుకోవటం కోసమే భక్తి కావాలి. మీ భక్తి అందుకే ఉపయోగపడుతోందా? మీరు బాగా ఆలోచించండి. ఏదైనా మీ కోరికలు నెరవేర్చుకోవటం కోసం మీరు భక్తిని ఖర్చు పెట్టుకొంటున్నారా? లేకపోతే మీ యొక్క మూలాన్ని తెలుసుకోవటం కోసం భక్తి మీకు సహకరిస్తోందా? అది చూసుకోండి. భగవాన్ చెపుతున్నారు - ఈ నేను ఎక్కడ పుట్టును అని సూక్ష్మబుద్ధిచేత సోధింపుము. జడ శరీరం నేను అని అనదు. ఈ శరీరం నేను నేను అంటే, శవం కూడా నేను నేను అనాలి. ఈ శరీరంలోంచి ప్రాణం పోయాక, ఈ అరటిచెట్టు ఎంతో, ఈ స్తంభం ఎంతో, ఈ మైక్ ఎంతో, ఈ శరీరం అంతే. శరీరం నేను అని అనదు. శవం నేను అంటుందా ఎక్కడైనా! శవం నేను అనదు. ఆత్మ కూడా నేను నేను అనదు. నడిమి మధ్య దేహ పరిమాణముగా నేను ఒకటి పుట్టును. అదే మనస్సు అదే బంధము, అదే జీవుడు, అదే సూక్ష్మ శరీరము, అదే సంసారము మొదలైనవని తెలియును. ఎంత వివరంగా చెప్పారో చూడండి రమణమహర్షి. ఏదైతే నేను నేను అని నువ్వు అంటున్నావో, ఏదైతే దేహానికి పరిమితమైన నేనో, ఏదైతే మనస్సుకి పరిమితమైన నేనో, అదే బంధము. బంధమంటే మీ ఇంట్లో ఉన్న సంసారం బంధం కాదు, మీ ఇంట్లో ఉన్న పిల్లలు బంధం కాదు. ఈ నేను నేను అనేదే నిజమైన బంధము. జీవుడు అంటే ఎక్కడో లేడు, గడ్డాలు మీసాలు లేవు జీవుడికి. నువ్వు దేనినైతే నేను అంటున్నావో, ఆ నేనే జీవుడు. అదే సూక్ష్మశరీరము. ఈ కనిపిస్తున్నటువంటి శరీరం స్థూలశరీరం. వేదాంత పరిభాషలో మనస్సుని సూక్ష్మశరీరం అంటారు, అంటే సటిల్ బాడీ. సూక్ష్మశరీరం లోపల ఇంకో శరీరం ఉంది. అది కారణ శరీరం. అదే అజ్ఞానము. ఆ అజ్ఞానం ఉన్నంత కాలమూ,

ఈ స్థూలశరీరమూ, సూక్ష్మశరీరమూ, ఈ రెండు శరీరాలు తప్పవు. అంటే దానికి కారణం ఉన్నంతసేపు ఈ రెండు శరీరాలు వస్తూనే ఉంటాయి. సంసారం అంటే నీ బయట ఉన్న ప్రపంచమూ ఇంట్లో ఉన్న వ్యక్తులూ సంసారం కాదు. నువ్వు ఏదైతే నేను నేను అంటున్నావో అదే సంసారం. అంటే ఆ నేనుని మనం విడిచిపెట్టనంత కాలం, ఆ నేనుని మనం పోగొట్టుకోలేనంత కాలం, ఈ శవాలు వస్తాయి, సంసారాలు వస్తాయి, లోకాలు వస్తాయి, ఇవన్నీ తప్పవు. ఈ నేను నేను అనే భావన ఉన్నంతకాలం, ఈ నేను నేను అనే తలంపు ఉన్నంతకాలం ఈ ద్వైతం అనేది తప్పనే తప్పదు.

ఇక్కడ కూర్చున్న మనుషులలో స్త్రీలలో కానీ, పురుషులలో కానీ దుఃఖం లేని మనిషి ఎవరైనా ఉన్నారా? నాకు ఏమీ దుఃఖం లేదు, నేను సుఖంగా ఉన్నాను అని చెప్పటానికి ఎవరైనా సిద్ధంగా ఉన్నారా? ఈ లోకం అట్టిదండీ అని కొంతమంది అంటారు. లోకం మిమ్మల్ని ఏమైనా దుఃఖపడమని అంటోందా? చదువుకున్న వాళ్ళు ఉన్నారు, ధనవంతులు వున్నారు, వాళ్ళకి కూడా దుఃఖం వస్తోంది. కారణం ఏంటి? పోనీ ఎవరైనా దుఃఖపడుతున్నారు అనుకోండి, వాళ్ళ దుఃఖాన్ని కొంచెం చేతిలో వేసుకొని చూపించమనండి. దుఃఖం వచ్చినప్పుడు మీకు తలంపు లేకుండా దుఃఖం వస్తోందా, తలంపు వచ్చిన తరువాత దుఃఖం వస్తోందా? కొంతమంది మాకు ఈ రోగం వచ్చిందండీ ఆ రోగం వచ్చిందండీ అని చెపుతూ ఉంటారు. అహంకారమే పెద్ద రోగం అని భగవాన్ చెప్పారు. అహంకారమనే పెద్ద రోగానికి ఈ శరీరం ఒక రోగం. అంటే అహంకారమనే పెద్ద రోగం ఉన్నంతకాలం ఈ శరీరాలు వస్తూ వుంటాయి. దేహమే ఒక రోగం అయినప్పడు, దేహానికి రోగం వస్తే ఆశ్చర్యం ఏముంది? అందుచేత పెద్ద రోగాన్ని తొలగించుకోనంత కాలం మీకు ఈ రోగాలు వస్తూనే వుంటాయి. అందుచేత అహంకారాన్ని తొలగించుకోండి. అప్పుడు మీకు శరీరంతో పనే లేదు. శరీరం లేని వాడికి రోగం ఏంటి? శరీరం లేని వాడికి దేవుడు ఏంటి? శరీరం లేని వాడికి లోకం ఏంటి? శరీరం లేనివాడికి శోకం ఏంటి? అంటే మన భక్తి ఎలా ఉంది అంటే నేను యొక్క మూలాన్ని తెలుసుకోవాలనే ప్రయత్నమే మనకి లేదు. మన ప్రయత్నం ఏమిటంటే, ఈ నేను ఇక్కడ ఉండాలి. దేవుడు వేరుగా అక్కడ ఉండాలి, లోకం ఉండాలి. ఆ దేవుడిని మనం ఏదోఒకటి అడుగుతూ ఉండాలి. పూజలు చేసి, జపాలు చేసి మనం దేవుడిని అడుగుతూ ఉండాలి, మనం అడిగినవి అన్నీ ఆ దేవుడు ఎప్పుడూ మనకి ఇస్తూ ఉండాలి. మనకి మరణం రాకూడదు. లోకం ఎప్పుడూ ఇలాగే ఉండాలి, మనం ఇక్కడే ఉండాలి, ఆ దేవుడు ఇచ్చిన భోగాలు అన్నీ మనం అనుభవించాలి! ఇదీ మన భక్తి యొక్క లక్ష్యం. మన

ఇంద్రియాలని సంతృప్తి పరచటం కోసం, మనం భోగాలు అనుభవించటం కోసం మనకి భక్తి కానీ, మోక్షం కోసం కాదు, శాంతి కోసం కాదు. ఇది నిజమా అబద్ధమా?

ఏమండీ ఇంకొక ప్రశ్న అడుగుతున్నాను - మీరు చాలా సుఖంగా ఉన్నారనుకోండి ఇంక మీకు దేవుడెందుకు? మీకు ఏవిధమైన కష్టం కానీ నష్టం కానీ దుఃఖం కానీ లేదనుకోండి మీకు దేవుడితోటి పనేముంది? మీరు శాంతిగా సుఖంగా ఉన్నారనుకోండి, సుప్రీమ్ పీస్ అండ్ సుప్రీమ్ హాపీనెస్‌లో మీరు ఉన్నారనుకోండి, అప్పుడు మీకు దేవుడితోటి పనేముంది? ఒకసారి రమణస్వామిని ఏమని అడిగారంటే, బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు, శివ దేవుడు, ఈ ముగ్గురూ కలిసి మీకు కనిపిస్తారు అనుకోండి, కనిపిస్తే వారిని మీరు ఏమైనా కోరుకుంటారా? ఎందుకు కోరుకోను, కోరుకుంటాను అన్నారు రమణస్వామి. నాకూ కోరికలు ఉన్నాయి నేను కోరుకుంటాను అన్నారు. బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు, శివ దేవుడు కనిపిస్తే కోరుకుంటారట రమణస్వామి. ఏమని కోరుకొంటారు మీరు అని అడిగాడు. మీరు ఎప్పుడూ నాకు కనిపించవద్దు అని కోరుకొంటాను అని చెప్పారు. బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు, శివదేవుడు కనిపిస్తే రమణస్వామి కోరుకుంటారట. ఏమని అంటే, మీరు ఎప్పుడూ నాకు కనిపించకండి అని కోరుకుంటారట. అంటే నిజమైన శాంతి మీకు అనుభవం అయితే, పరిపూర్ణమైనటువంటి ఆ సుఖం మీకు అనుభవం అయితే, దేవుడు నిజంగా వచ్చి మీకు కనిపిస్తే, మీకు ఇలా ముఖం పైకి ఎత్తి చూడాలనిపించదు. అట్టిది ఆ శాంతి, ఆ పరిపూర్ణమైన శాంతి, ఆ పరిపూర్ణమైన సుఖం, ఆ నిర్మలమైనటువంటి సుఖం మీ బుద్ధికి అందినప్పుడు, నిజంగా దేవుడు రూపం ధరించి మీ దగ్గరికి వచ్చినప్పటికీ, మీకు కళ్ళు ఎత్తి చూడాలనిపించదు. అటువంటి సుఖం, అటువంటి శాంతి, మీ హృదయంలోనే ఉంది.

కొంతమంది ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోతే, ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోతే, ఎక్కడికో వెళ్ళిపోతే శాంతి వస్తుంది అనుకుంటారు. భగవాన్ ఏమన్నారంటే మీరు ఇల్లు విడిచిపెట్టి పారిపోతే, ఊరు మారుతుంది, దేశం మారుతుంది, వాతావరణం మారుతుంది, పరిసరాలు మారతాయి, పరిస్థితులు మారతాయి, మీ అహంకారం మీ కూడానే వస్తుంది! కొంతమంది కాశీ వెళ్ళిపోదాం, రామేశ్వరం వెళ్ళిపోదాం అనుకుంటారు. కాశీ వెళ్ళిపోతే మీకు శృంగవృక్షం కనపడదు. నువ్వు ఎక్కడికి వెళ్ళు, నీ అహంకారం నీకూడా వస్తుంది. మనిషి కూడా నీడ ఎలా పరిగెత్తుకు వస్తుందో, నీ అహంకారం నువ్వు ఎక్కడికి వెళ్ళినా వస్తుంది. నువ్వు ఇంటిదగ్గర టైముకి భోజనం చేసి, టైముకి కాఫీ తాగి, నువ్వు అహంకారాన్ని

జయించలేనప్పుడు, అడవులకు వెళ్ళి ఎక్కడో దూరాన గంగానది ఒడ్డున, నువ్వు అహంకారాన్ని జయించగలవా? నువ్వు ఇంటికాడ ఉన్నా అహంకారాన్ని జయించాలి, అడవులకు వెళ్ళినా అహంకారాన్ని జయించాలి. నువ్వు ఇంటిదగ్గర ఉండి చేయలేని పని, అడవిలోకి వెళ్ళి చెయ్యగలవా? నీకు అన్ని సదుపాయాలూ ఉండగానే, ఇంటి దగ్గర నువ్వు ఆ పని చేయలేకపోతే, అహంవృత్తిని జయించలేకపోతే, అరణ్యాలకు వెళ్ళి చెయ్యగలవా?

ఇప్పుడు మీరందరూ ఎక్కడ ఉన్నారు? మీరందరూ మోక్షంలోనే ఉన్నారు. మీ పేరు ఎల్లమ్మా కాదు పుల్లమ్మాకాదు. మీ పేరే మోక్షం. పోనీ మోక్షంలో లేరనుకోండి, ఎక్కడ ఉన్నారు మీరు ఇప్పుడు? మనకి మరణం వచ్చినప్పుడు కూడా ఈ అహంకారం ఏదో రూపాన్ని స్మరిస్తూ మరణిస్తుంది. రూపాన్ని పట్టుకొని పుడుతుంది. రూపాన్ని పట్టుకొని నిలుస్తుంది. రూపాన్ని విడిచి రూపం దాల్చును, వెదకగ వదిలి పరిగెత్తును, ఆ రూపము లేని అహంకార పిశాచి! ఈ లోకానికి సంబంధించిన రూపాలని పట్టుకొంటోంది అహంకారం. అందుచేత ఏ రాముడో, కృష్ణుడో, శివుడో ఏదో ఒక రూపాన్ని ఆరాధించగా ఆరాధించగా, మన మనస్సును అంటిపెట్టుకొని ఉన్న మిగతారూపాలన్నీ రాలిపోతాయి. మీరు ఒక రాముడినో కృష్ణుడినో ఆరాధిస్తున్నారు అనుకోండి, ఆరాధించగా ఆరాధించగా, మీ మనస్సు ఆ రూపాన్నే కనుక పట్టుకొని ఉంటే, ఏ కారణాలైతే, ఏ విషయాలైతే, మిమ్మల్ని బంధిస్తున్నాయో, అవన్నీ రాలిపోతాయి. భగవంతుడు గీతలో ఏమని చెప్పాడంటే, మరణించే టైములో, ప్రాణ ప్రయాణ టైములో, నన్ను స్మరిస్తే నా స్వరూపము ఇస్తాను అన్నాడు. ఆయన స్వరూపము అంటే ఏంటో కాదు, ఆత్మే, సత్యమే!

భగవద్గీతలో కృష్ణుడు చెప్పిన ఈ మాటని చాడ్విక్‌గారు చదివారు. ఇంగ్లండులో ఆర్మీలో మేజరు జనరల్‌గా చేసాడు ఆయన. ఆ దొరగారు చదివారు భగవద్గీతలో ఈ మాట. ప్రాణం పోయే టైములో ఎవరైతే నన్ను స్మరిస్తున్నారో వాళ్ళకి నా స్వరూపాన్ని ఇస్తాను అని భగవద్గీతలో భగవంతుడు చెప్పిన మాట. ఆ శ్లోకాన్ని ఎక్కువ స్మరించుకునేవారు ఈ దొరగారు. ఈయన రమణస్వామి భక్తుడు. ఈయన అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేస్తున్నారు ఒకరోజున. ప్రదక్షిణ చేస్తూ, ఈయన అరుణాచల శివుడిని ధ్యానం చేస్తున్నారు. ఎదురుగా ఒక లారీ వస్తోంది. ఈ దొరగారు ఏమనుకొన్నారంటే, భగవద్గీతలో కృష్ణుడు ఇలా చెప్పాడు కదా. ఎదురుగా లారీ వస్తోంది. ఇప్పుడు నా మనస్సు అరుణాచలేశ్వరుడిని స్మరిస్తోంది. చివర టైములో దేవుడిని స్మరిస్తే దేవుడి స్వరూపాన్ని పొందుతావు అని

భగవంతుడు చెప్పాడు. భగవంతుడు అబద్ధం చెప్పడు కదా. ఇప్పుడు ఎదురుగా లారీ వస్తోంది. ఆ లారీకింద నేను పడిపోతాను, ఆ లారీకింద పడిపోతే నా ప్రాణం పోతుంది. ఇప్పుడు నేను భగవంతుడిని స్మరిస్తున్నాను కాబట్టి నాకు మోక్షం వచ్చేస్తుంది అని ఒక నిర్ధారణకి వచ్చాడు. ఈ టైములో నా మనస్సు భగవంతుడిని స్మరిస్తోంది కాబట్టి. లారీకింద పడదాము అనుకొంటున్నాడు. ఈ లోపల ఆ లారీ వచ్చింది, తప్పించుకొని పోయింది. సరే, రమణమహర్షి గారి దగ్గరకి వచ్చి కూర్చున్నాడు. ఈయనికి వచ్చిన ఆలోచనలు అన్నీ తెలుసు ఆయనకి. ఏమీ తెలియనట్టు ఊరికే గోడవంక అలా చూస్తున్నాడు. ఆయనకి జీవితంలో నటన అనేది ఎలా ఉంటుందో తెలియదు. ఆడంబరం అనేది ఎలా ఉంటుందో తెలియదు. బహు నిరాడంబరుడు. ఎవరైనా మేము ఈ విధంగా అనుకున్నాము, మీకు ఏమీ తెలియదా అని అడిగితే నేనేమి చేస్తాను, నాకు ఏమీ తెలియదు, భగవంతుడు ఆ శక్తులు నాకు ఇవ్వలేదు అనేవారు. అదీ నిరాడంబరత అంటే. ఎవరైనా నేను ఫలానా విధంగా అనుకొన్నాను. నా మనస్సులో అనుకొన్నది మీకు తెలియలేదా అని అడిగితే, నాకు ఏమీ తెలియలేదు అనేవారు. మీ మనస్సులోఏమనుకొన్నారో తెలుసుకొనే శక్తి భగవంతుడు నాకు ఇవ్వలేదు అన్నారు. ఆయన ఋషి అంటే! నటించేవాడు ఋషికాదు. చాడ్విక్ వచ్చి కూర్చున్నాడు. నాకు మోక్షం వచ్చేస్తుంది అని లారీ కింద పడిపోదాము అనుకొన్నాను, ఇలా అనుకొంటూ ఉంటే లారీ వచ్చి దాటి వెళ్ళిపోయింది అని భగవాన్‌తో చెప్పాడు. అప్పుడు భగవాన్ ఒక మాట అన్నారు. లారీ వచ్చినప్పుడు నువ్వు అరుణాచలేశ్వరుడిని స్మరించుకొంటున్న మాట నిజమే. కానీ గీతలో భగవంతుడు ఏం చెప్పాడు, ఈ లాజిక్ వినండి. ప్రాణం పోయే టైములో నన్ను స్మరిస్తే నేను మోక్షం ఇస్తాను అని చెప్పాడు. అది కరక్టే. భగవద్గీతలో వాసుదేవుడు చెప్పిన స్టేట్మెంట్ కరెక్టే. లారీకింద పడదాము అనుకొంటున్నప్పుడు నువ్వు భగవంతుడిని స్మరిస్తున్నావు. కానీ నువ్వు లారీకింద పడి, ఆ లారీ వచ్చి నీ పీకమీదనుంచి వెళ్ళిపోయినప్పుడు, సరిగ్గా ప్రాణం పోయేటైములో నువ్వు భగవంతుడిని స్మరించలేవు. నీకు మోక్షం రాదు అని చెప్పారు. అదేమిటండీ స్వామీ అన్నాడు. అంటే దాని అర్థం ఏం చెప్పారంటే, ప్రాణం పోయేటప్పుడు ఈ చిలకపలుకులు రావు. చిలకకి నేర్పుతారు రామా రామా అని. ఆ చిలకని పిల్లి వచ్చి పట్టుకుంది అనుకోండి. రామా రామా అంటుందా అది? అలాగ మన భక్తి నేర్చుకున్న భక్తి ఇది. మన భక్తి హృదయంలోంచి వచ్చింది కాదు. నేర్చుకున్నది. కల్టివేట్ చేస్తాము. అంటే మనది నేర్చుకున్న భక్తి, ఎందుచేతనంటే ప్రాణం పోయే టైములో

వచ్చే ఆ  భక్తి ఇంకా మనకి రాలేదు.  ఆ స్థితి మనకి ఇంకా రాలేదు.  ఇదంతా కల్టివేట్ చేస్తున్నాం.  లారీ కింద పడదాము అనుకొంటున్నప్పుడు నువ్వు భగవంతుడిని స్మరిస్తున్నావు. అది కరెక్టే.  ఆ లారీ వచ్చి నీ పీకమీద నుంచి వెళ్ళిపోయినప్పుడు, నువ్వు అరుణాచలేశ్వరుడిని స్మరించవు.  కృష్ణుడిని స్మరించవు.  రాముడుని స్మరించవు.  దైవాన్ని అసలు స్మరించనే స్మరించవు.  అప్పుడు ఏది స్మరిస్తావో చెప్పమంటావా! ఏదైతే నీ హృదయంలో  బరువుగా ఉందో, ఏ వాంఛ అయితే, ఏ కోరిక అయితే, ఏ ఆదర్శం అయితే, ఏ ఆశయం అయితే, ఏ ఆకాంక్ష అయితే, నీ హృదయంలో బరువుగా ఉందో, నీ హృదయంలో ఏది ముఖ్యంగా నువ్వు ఉపాసిస్తున్నావో, నీ హృదయంలో ఉన్న కోరిక నీకు ప్రాణం పోయే టైములో నీ మెదడులోకి వస్తుంది కానీ, దేవుడు రాడు అని చెప్పాడు.

ఇంకొకటి జ్ఞాపకం ఉంచుకోండి మీరు.  ప్రాణం పోయేటైము మనకి తెలియదు. ప్రాణంపోయే టైము మనకి వస్తుంది అనుకోండి  ఆ ప్రాణం సరిగ్గా ఏ సెకనులో పోతుందో మనకి తెలియదు.  అందుచేత, ప్రాణంపోయే టైములో నువ్వు ఈశ్వరుడిని స్మరించలేవు. నీ హృదయంలో ఉన్న కోరిక నీకు బయటికి వస్తుంది.   ఆ కోరికనే స్మరిస్తావు.  కానీ ఈశ్వరుడిని మట్టుకు స్మరించవు.  అందుచేత అటువంటి పనులు చెయ్యకు అన్నాడు చాడ్విక్‌తో.

అహంకారం ఉంటే అంతా ఉంది.  అహంకారం ఉంటే ప్రపంచం ఉంది.  అహంకారం ఉంటే దేవుడు ఉన్నాడు.  అహంకారం ఉంటే లోకం ఉంది.  అంహకారం ఉంటే జీవుడు ఉన్నాడు.  అహంకారం ఉంటే సంసారం ఉంది.  అహంకారం లేకపోతే ఏమీ లేదు.  అది ఉంటే అంతా ఉంది!  గౌరవం ఉంది, అగౌరవం ఉంది, కీర్తి ఉంది, అపకీర్తి ఉంది, రాగం ఉంది, ద్వేషం ఉంది.  అహంకారం ఉంటే, ఇవన్నీ ఉన్నాయి.  అహంకారం లేకపోతే ఏమీ లేవు.  ఈ లోభము, రాగము, ద్వేషము, ఇదంతా అహంకారానికి సైన్యం.  వీటన్నిటికీ అహకారం కమాండర్ ఇన్‌ఛీఫ్!  అహంకారం ఉంటే అంతా ఉంది.  అహంకారం లేకపోతే ఏమీలేదు. కనుక అహంకారమే అఖిలము.  ఇది ఏది అని వెదుకుటయే సకలమును వదులుట అని తెలియును.  అందుచేత మీకు మీ భర్తని వదిలేస్తే మీకు జ్ఞానము రాదు.  మీ ఇల్లుని వదిలేస్తే మీకు జ్ఞానము రాదు.  లేకపోతే మీకున్న వస్తువులని వదిలేస్తే మీకు జ్ఞానమురాదు. మీరు చేసుకొనే పనిపాట్లు వదిలేస్తే మీకు జ్ఞానం రాదు.  ఒకవేళ మీరు ఆత్మహత్య చేసుకుంటే, మీ దేహాన్ని విడిచిపెట్టేస్తే, మీకు జ్ఞానం రాదు.  కాని అహంకారాన్ని విడిచిపెడితే జ్ఞానం

వస్తుంది అన్నాడు. మీకున్న బాహ్యమైన వస్తువులని విడిచిపెట్టేస్తే జ్ఞానంరాదు. ఇల్లు విడిచిపెట్టేస్తే జ్ఞానం రాదు. ఎవడైతే అహంకారాన్ని విడిచి పెడుతున్నాడో, దేహానికి పరిమితమైన నేనుని ఎవడైతే విడిచిపెడుతున్నాడో, దాన్ని ఎవడైతే త్యాగం చేస్తున్నాడో, వాడికి మట్టుకే జ్ఞానం కలుగుతుంది. మీకు వేరుగా ఉన్న వస్తువులని విడిచి పెట్టినంత మాత్రంచేత మీకు జ్ఞానం వచ్చేయదు. అంటే మీరు రోజూ ఇంటి దగ్గర చేసుకునే పనులలో కూడా మీ అహంకారం తగ్గే విధానం మీరు చూసుకోవాలి. మీకు వచ్చే ఆలోచనలలో, మీరు చేసుకునే పనులలో, మీరు చేసుకునేటువంటి కార్యక్రమంలో, మీ అహంకారం పలచపడుతూ ఉండాలి. అహంకారం పలచబడేలా మీరు చూసుకుంటే, ఈశ్వరానుగ్రహం మీకు వస్తుంది. మీరేదైనా దానాలు చేసారు అనుకోండి, దానివల్ల అహంకారం పెరగకూడదు. అహంకారం తగ్గాలి. మీరేదైనా మంచి పని చేసారు అనుకోండి, దానివల్ల అహంకారం పెరగకూడదు. అహంకారం తగ్గాలి. మీరు పూజ చేసారు అనుకోండి, పూజవల్ల అహంకారం తగ్గాలి, అహంకారం పెరిగితే పూజ యొక్క ప్రయోజనం లేదు. అలాగే ధ్యానం చేస్తున్నారు అనుకోండి దాని వలన అహంకారం తగ్గాలి. మీ ధ్యానం పేరు మీద అహంకారం పెరిగితే, ఆ ధ్యానం వల్ల ప్రయోజనం ఏమీ లేదు.

ఈ స్మరించేవాడు ఎవడు అని? రమణస్వామి చెప్పారు - జీవితం పొడుగునా వ్యవసాయం చేసేవాడు, మరణించే టైములో ఆ వ్యవసాయం గొడవలే స్మరిస్తూ ఉంటాడు. జీవితం పొడుగునా వ్యాపారం చేసేవాడికి మరణించే టైములో ఆ వ్యాపారం గొడవలే బుర్రలోకి వస్తాయి. అయితే జీవితం పొడుగునా ఎవడు ఏ పని చేస్తే, మరణించే టైములో అవే వస్తాయి. అలాగే రాముడినో, కృష్ణుడినో వాడు స్మరించుకొంటూ ఉంటాడు అనుకోండి జీవితం పొడుగునా, పోనీ వాడికి మరణించే టైములో, రాముడో కృష్ణుడో ఆ తలంపు వస్తుంది, రైటే! అయితే ఈ స్మరణ చేసేవాడు ఎవడు? పోనీ మంచి విషయాలు స్మరించిన వాడికి మంచి జన్మలు వస్తాయి, చెడ్డ విషయాలు స్మరించిన వాడికి చెడ్డ జన్మలు వస్తాయి. అసలు ఈ స్మరణ చేసేవాడు ఎవడు? థింకర్ ఎవడు? ఆలోచించేవాడు ఎవడు? వాడిని ఎప్పుడైనా చూసారా? నేను అది చూసాను ఇది చూసాను అంటున్నారు కానీ ఆ చూసేవాడిని ఎప్పుడైనా చూసారా? మీలో ఉండి ఎవడో చూస్తున్నాడు కదా ఈ లోకాన్ని. ఆ చూసేవాడిని మీరు ఎప్పుడైనా చూసారా?

భగవాన్ దగ్గరకి వచ్చి ఒకళ్ళు ఇలా చెప్పారు. ఏమండీ మేము జపం చేస్తున్నాము,

మా గురువు గారు జపం చెయ్యమన్నారు, ఆ జపం వల్ల ఫలితం వస్తుంది, ఆ ఫలితాన్ని మా గురువుగారు ఆయనకి ఇచ్చేయమన్నారు. జపం మట్టుకు నన్ను చెయ్యమన్నారు అని చెప్పాడు. అప్పుడు భగవాన్ అన్నారు ఈ గురువు కంటే మీ గురువే మంచివాడు. మీ గురువు ఎందుకు మంచివాడంటే, జపం నిన్ను చేసుకోమంటున్నాడు, ఫలితాన్ని ఆయన పుచ్చుకుంటాను అంటున్నాడు. అసలు మీ దగ్గరే ఉంది, కానీ వడ్డీ మట్టుకు ఆయన తింటున్నాడు. కానీ ఈ గురువు ఏం చేస్తాడంటే, అసలూ మింగేస్తాడు, వడ్డీ మింగేస్తాడు. అందుచేత ఈ గురువు కంటే మీ గురువే మంచివాడు. మీ గురువు మంచివాడు కాబట్టి జపం చేసేవాడిని ఉంచుతున్నాడు. ఈ గురువు జపం చేసేవాడినీ తినేస్తాడు. అంటే జపం చేసే జపినీ తినేస్తాడు. ఆ జపం వల్ల వచ్చే ఫలితాన్ని తినేస్తాడు. ఈ గురువు మీద మీ గురువే మంచివాడు అన్నారు భగవాన్.

భగవాన్ దగ్గరికి ఆయన స్నేహితుడు ఒకడు వచ్చాడు. నీ పేరు నేను విన్నాను. నీ ఫొటోలు చాలా షాపులలో చూసాను. మనమిద్దరమూ చిన్నప్పుడు చదువుకున్నాము. ఈతలు కొట్టేవాళ్లము. నేనేదో నా దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఉద్యోగం చేస్తున్నాను. నువ్వు చాలా పైకి వచ్చావు అని రమణస్వామి చిన్ననాటి స్నేహితుడు ఒకడు రమణస్వామితో చెప్పాడు. ఏమయ్యా నేను పైకి రాలేదు, లోపలికి వెళ్ళాను అన్నాడు రమణస్వామి. నేను పైకి వచ్చాను అనుకొంటున్నావు. మనకి ఎంతసేపూ పైకి వెళ్దామనే! భగవంతుడు నీ హృదయంలో ఉన్నానని చెపుతున్నాడా లేకపోతే పైన ఉన్నానని చెపుతున్నాడా? ఆయన మన హృదయంలో ఉన్నానని చెప్పాడు. అదే భగవాన్ చెప్పారు - నేను పైకి రాలేదు, లోపలికి వెళ్ళాను.

ఒకరు భగవాన్‌తోటి అన్నారు, ఏమండీ ఎప్పుడు చూసినా మీరు మాతోటి మాట్లాడుతున్నారు. మీరు జపం చేసుకోవటం లేదు, ధ్యానం చేసుకోవటం లేదు, ఏమీ చేసుకోవటం లేదు, ఎంతసేపూ మాతోటి కూర్చుంటున్నారు, మాతోటి వంటపనులు చేస్తున్నారు, మీరు మాలో ఒకరిగా ఉండి బయట తిరుగుతున్నారు. మీరేమీ ధ్యానం జపం చేసుకోవటం లేదు అన్నారు. అప్పుడు భగవాన్ అన్నారు, బయట ఉన్న వాడు లోపలికి వెళ్తాడు. నేను ఇప్పుడు బయట ఉన్నానా? నన్ను లోపలికి వెళ్ళమంటున్నారు అని అడిగారు భగవాన్. ఆయనని ధ్యానం చేసుకోమని వీళ్ళ ఉద్దేశం. ధ్యానం ఎవరితోటి చేస్తాడు ఆయన! మనస్సుతోటి చెయ్యాలి. అక్కడ మనస్సు ఎక్కడ ఉంది? ఉన్నది ఒకటే వస్తువు, ఆత్మ! ఇంక దేనితోటి ధ్యానం చెయ్యగలడు ఆయన! అసలు మనస్సే లేనప్పుడు, లోపల ఏంటి, బయట ఏంటి?

ఈ లోపల, బయట, ఈ శరీరం లోపల నేను ఉన్నాను, నా బయట ప్రపంచం ఉంది. పైన ఎక్కడో దేవుడు ఉన్నాడు, ఇదంతా కల్పించేది మనస్సే. ఇదంతా మనస్సు యొక్క చేష్టలు. ఈ స్వామి పాడైపోయాడు, కాసేపు జపం ధ్యానం చేసుకోడేమిటి అని మీరు అనుకుంటున్నారు. నన్ను లోపలికి వెళ్ళిపోమంటున్నారు, నేను బయట ఉంటే లోపలికి వెళ్ళొచ్చు, అసలు బయటే లేనప్పుడు లోపలికి ఎక్కడికి వెళ్తాను? వేదాంత ఉపన్యాసాలలో మనస్సుని నిగ్రహించుకోవాలి మనస్సుని నిగ్రహించుకోవాలి అని చెప్తారు. మనస్సుని నిగ్రహించుకోవాలి, రైటే. అది ఎలా ఉంటుంది? దాన్ని ఎప్పుడైనా చూసారా మీరు? మనస్సు అంటే, మనకి వచ్చే తలంపే మనస్సు. ఈ తలంపు ఎక్కడినుంచి వస్తోంది, నేను వచ్చాక తలంపు వస్తోందా? నేను లేకుండా తలంపు వస్తోందా? ఇప్పుడు నేను అనే తలంపు నాకు ముందు వచ్చాక ఇతర తలంపులు వస్తున్నాయా? నేను అనే తలంపు లేకుండానే ఇతర తలంపులు వస్తున్నాయా? నాకు తలంపు వస్తోంది. అది మంచి తలంపో, చెడు తలంపో వేరే విషయం. ఆ తలంపు వస్తోంది. ఈ తలంపు ఎవరికి వస్తోంది, నాకు వస్తోంది. నేను ఎవడను? ఈసారి ఇలా ప్రశ్న వేసుకోండి. మీకు తలంపులు వస్తున్నాయి. ఎవరికి వస్తోంది తలంపు, నాకు వస్తోంది, నాకు వస్తోందంటే, నేను ఎవడను అనే ప్రశ్న వేయండి, ఈ తలంపు నెమ్మదిగా పుట్టింటికి వెళ్ళిపోతుంది. దాని హృదయం పుట్టిల్లు, ఈ బుర్రేమో అత్తారిల్లు అన్నారు భగవాన్. ఇప్పుడు మనకి అనేక తలంపులు ఉన్నాయి, అనేక వాసనలు ఉన్నాయి. కానీ అన్ని తలంపులు ఇక్కడ కనబడవు. ఏదో తలంపు వస్తుంది అది వెళ్ళిపోతుంది, మళ్ళీ ఇంకో తలంపు వస్తుంది అది వెళ్ళిపోతుంది. ఎవరికైనా రెండు తలంపులు ఒకేసారి వచ్చాయేమో చెప్పండి మీరు. ఒకేసారి పుట్టింటివద్ద, అత్తారింటివద్ద ఉంటున్నారా? ఉంటే పుట్టింటి దగ్గర ఉంటున్నారు, లేకపోతే అత్తారింటి దగ్గర ఉంటున్నారు. ఒకేసారి పుట్టింటివద్ద, అత్తారింటివద్ద కూడా ఉండగలరా? ఈ తలంపు ఉంటే పుట్టింటివద్ద ఉంటుంది, లేకపోతే అత్తారింటివద్ద ఉంటుంది.

వాసనలు అన్నీ ఏంచేస్తాయి అంటే, బొమ్మ వచ్చి తెరమీద పడ్డట్టు, ఒకో తలంపు శిరస్సు మీదకి వస్తుంది. ఏదైతే శిరస్సులోకి వచ్చిందో ఆ తలంపునే మనం పట్టుకుంటాము. మిగతా తలంపులు ఏమీ లేవా మనకి? ఆ ఒక్క తలంపే ఉందా? మీమీద నాకు కోపం వచ్చింది, అది ఒక తలంపు. మిగతా తలంపులు ఏమీ లేవా మనకి? ఇంకా తొంభై తలంపులు ఉన్నాయి. అవి ఇప్పుడు ఎక్కడ ఉన్నాయి? మీ ఇంటిలో ఇనపపెట్టెలో ఉన్నాయా, లేకపోతే భోషాణంలో ఉన్నాయా! నాకు మీమీద కోపంగా ఉంది, అది ఒక తలంపు, ఇది ఒకటే

కాదు ఇంకా చాలా తలంపులు ఉన్నాయి. ఆ తలంపులన్నీ ఇప్పుడు హృదయంలో ఉన్నాయి. ఈ తలంపు వెళ్ళిపోయిన తరువాత ఇంకో తలంపు వస్తుంది అక్కడినుంచి. ఆ తలంపు మళ్ళీ ఖర్చుపెట్టేసుకున్నాక ఇంకో తలంపు వస్తుంది. ఇవి ఏమౌతాయి? వచ్చిన తలంపుని మనం సంతృప్తి పరుస్తాం అనుకోండి, మన ఇంద్రియాల ద్వారా సంతృప్తి పరుస్తాము అనుకోండి, ఆ తలంపుకి ఇంకా ఫుడ్ పెరుగుతుంది, అది ఇంకా బలుస్తుంది, ఇంకా బలీయంగా హృదయంలో ప్రవేశిస్తుంది. ఇంకో సెకనుకి ఏమి తలంపు వస్తుందో మీకు తెలుసా? మనందరం చాలా తెలివైన వాళ్ళం, మేధావులం అనుకొంటున్నాము, ప్రజ్ఞావంతులం అనుకొంటున్నాము! ఇంకో సెకనుకి ఏమి తలంపు వస్తుందో చెప్పండి మీలో ఎవరైనా? మీరందరూ భక్తులే కదా! ఇంకొక సెకనులో ఏం తలంపు వస్తుందో చెప్పండి. ఇవన్నీ మన హృదయంలోనే ఉన్నాయి. ఏ సెకనులో ఏ తలంపు వస్తుందో మనకి తెలియదు. మనం చేసిన పనులు, మనకి వచ్చిన ఊహలు, అన్నీ స్టోర్ అయ్యి ఇక్కడ ఉంటాయి. మనం చేసిన పుణ్యాలు, మనం చేసిన పాపాలు, మనకున్న రాగాలు, మనకున్న ద్వేషాలు ఇవన్నీ ఇక్కడ స్టోర్ అయ్యి ఉంటాయి. మీ హృదయంలో వాసనగా స్టోర్ అయ్యి ఉండి, మనకి మరణించే టైములో ఒక్కసారి ఈ హృదయంలో ఉన్న తలంపులన్నీ విజృంభిస్తాయి. ఏదో ఒక రోజున మనకి ప్రాణం పోతుంది. ఆ ప్రాణం పోయేటప్పుడు హృదయంలో ఉన్న తలంపులన్నీ ఒక్కసారి విజృంభిస్తాయి. మనకి అనేక గొడవలు ఉంటాయి. ఒక్క గొడవ కాదు! సామాజిక సమస్యలు, ఆర్థిక సమస్యలు, లోక సమస్యలు, మళ్ళీ వీటన్నిటితోపాటు ఊరగాయ నంజుకున్నట్టు భక్తి ఒకటి! మనకి సెంటర్ లోకమే, దేవుడు కాదు. అయితే దేవుడు ఎందుకంటే, మనకి పచ్చడి వంటివాడు అన్నమాట! మెతుకులు మింగటానికి కొంచెం పచ్చడి ఎలా నంజుకుంటామో, ఈ లోకం కోసం ఒక దేవుడిని పెట్టుకున్నాము మనం. తయారుచేసుకున్నాము ఒక దేవుడిని. మన అహంకారాన్ని దేవుడికి అప్పచెప్పటం మనకి ఇష్టం లేదు, మన అహంకారంతోటి వాడిని మింగుదామని! ఏ దేవుడినైతే మనం ప్రార్థిస్తున్నామో వాడిని మింగటానికి చూస్తున్నాము మనం. అది మన భక్తి.

అహంకారం కలదనిన అఖిలము కలుగును, అది లేదనిన అఖిలము లేదు, కనుక అహంకారమే ప్రపంచం. అది వెదకుటయే సకలము వదలుట. అహంకారాన్ని వెదకండి, అహంకారాన్ని అన్వేషించండి. దాని మూలాన్ని తెలుసుకోండి, తెలుసుకుంటే అది పడిపోతుంది. అహంకారం ఎవరినీ విడిచిపెట్టదు. ఎవరిని విడిచిపెడుతుంది అంటే అహంకారం యొక్క మూలం ఎవడికైతే తెలిసిందో వాడిని మట్టుకే అహంకారం విడిచిపెట్టి

వెళ్ళిపోతుంది. ప్రాణ ప్రయాణ టైములో, ఆటోమేటిక్ డివైన్ ఆక్షన్‌లాగా, తలంపులన్నీ, జీవితంలో మనం చేసిన పనులు, మరణ కాలంలో విజృంభిస్తాయి, అది నోటితోటి చెప్పలేము మనం. మరణకాలంలో విజృంభిస్తాయి. అలా విజృంభించేటప్పుడు చాలా ఇష్టమైన కోరికలు కొన్ని ఉంటాయి, ఇష్టంలేని కోరికలు కొన్ని ఉంటాయి. ఏదైతే గాఢంగా, గూఢంగా లోతుగా, ఏ వాసనైతే, ఏ సంస్కారమైతే, మన హృదయంలో ఉండిపోయిందో, అది బలీయంగా ఉబికినట్టు వస్తుంది ప్రాణం పోయేటప్పుడు. ఏదైతే మనకి చాలా ప్రియమైనదో, ఏదైతే నియరెస్టో ఏదైతే డియరెస్టో మనకి, సరిగ్గా ఆ వాసనని పట్టుకుంటుంది అహంకారం. ఆ వాసనని పట్టుకుని, మొత్తం ఈ సంస్కారాలనన్నిటిని పోగుచేసుకున్న తరువాత అప్పుడు ప్రాణాన్ని విడిచిపెడుతుంది. అప్పటిదాకా ఎంత కంగారు పడ్డా ప్రాణం పోదు. అంటే రాబోయే జన్మ అప్పడే నిర్ణయం అయిపోతుంది మనకి. రాబోయే జన్మ, మనకి ప్రాణ ప్రయాణ టైములో నిర్ణయం అయిపోతుంది.

మనం ముందుకి అడుగు వేసిన తరువాత వెనకాల కాలు ఎత్తుతాము. రెండు కాళ్ళు ఒకసారే ఎత్తుతాము అనుకోండి, బోర్లా పడతాము. ఈ అహంకారం రాబోయే రూపాన్ని కూడా నిర్ణయం చేసుకొని, తరువాత ఈ రూపాన్ని విడిచిపెడుతుంది. అంతవరకూ ఈ రూపాన్ని విడిచిపెట్టదు. అదే పునర్జన్మ. అంటే పునర్జన్మ అంటే ఏమిటి - అహంకారం అలాగే ఉంటుంది, అహంకారం మరణించదు. అహంకారానికి నాశనం లేదు. శరీరానికే మరణం, శరీరానికే నాశనం, అహంకారానికి నాశనం లేదు. ఆత్మ దర్శనం అయ్యేవరకూ అహంకారానికి నాశనం లేదు. నిజాన్ని చూసేవరకూ దానికి నాశనం లేదు. ఈ అహంకారం శరీరాన్ని విడిచిపెట్టేముందు, ఇంకో శరీరాన్ని పట్టుకొని, ఇంకో శరీరం యొక్క ఆధారాన్ని తీసుకొని, అప్పడు ఈ శరీరాన్ని విడిచిపెడుతుంది. ఆ శరీరంలో ప్రవేశిస్తుంది. సత్యాన్ని దర్శించిన వాడికే అది లొంగుతుంది.

భగవాన్ ఏమన్నారు అంటే ఏదైతే నిజమో అది ఒక్కటే మనం మరచిపోతాము, మిగతావి అన్నీ మనకి జ్ఞాపకం ఉంటాయి, భగవాన్ ఊరు నుంచి ఒక పెద్దమనిషి వచ్చి భగవాన్‌తో చెప్పారట - మీరూ మేమూ బ్రాహ్మణులమే అని. భగవాన్ సరి సరి అన్నారు. మీ నక్షత్రం పునర్వసు నక్షత్రం, నా నక్షత్రం పునర్వసు నక్షత్రమే. భగవాన్ సరి సరి అన్నారు. మీ గోత్రం నా గోత్రం ఒకటే. భగవాన్ సరి సరి అన్నారు. మీ వయస్సు నా వయస్సు ఒకటే, అంటే ఇద్దరిదీ వయస్సు కూడా ఒకటే. భగవాన్ సరి సరి అన్నారు. ఆఖరున అన్నారు అన్నీ చెప్పేసారా, ఇంకా ఏమైనా మిగిలి ఉన్నాయా అన్నారు భగవాన్. స్వామీ అన్నీ చెప్పేసాను,

గోత్రం, నక్షత్రం అన్నీ చెప్పేసాను అన్నాడాయన. అన్నీ చెప్పేసారు కానీ ఒక్కటి మరచిపోయారు. మీలోనూ నాలోనూ ఒకటే ఆత్మ ఉంది, అది మరచిపోయారు. ఇదే మాయ!

కొంతమంది జపం చేసుకునేటప్పుడు ధ్యానం చేసుకునేటప్పుడు ఏమంటారంటే లేనిపోని గొడవలన్నీ వచ్చేస్తున్నాయండీ బుర్రలోకి అంటారు పాపం - ఏమండీ మీకు వస్తున్నాయా అలాగా? మీకెవరికీ రావటం లేదేమో, అసలు ఏమీ గొడవలు లేవేమో మీకు! అలా దేవుడి పటం ఎదురుగా కూర్చుంటారు, ఆ ఊళ్ళో గొడవలు, దేశంలో గొడవలు అన్నీ వచ్చేస్తాయి వాళ్ళ బుర్రలోకి. అలా వస్తే మీకు నష్టం ఏమిటి అని అడిగారు భగవాన్. మీకు లోపల ఉన్న గొడవలు బయటికి వస్తున్నాయా, లేకపోతే లోపల లేని గొడవలు బయటికి వస్తున్నాయా? మీ హృదయంలో ఉన్న గొడవలే మీ బుర్రలోకి వస్తున్నాయా, లేకపోతే మీ హృదయంలో లేని గొడవలు మీ బుర్రలోకి వస్తున్నాయా? రానివ్వండి, అసలు మీ హృదయంలో ఏ గొడవ ఉందో అది మీ బుర్రలోకి వచ్చేవరకూ మీకే తెలియదు. మీ హృదయంలో ఏ గొడవ ఉందో మీకే తెలియదు. ఎప్పటివరకూ తెలియదు, అది మీ బుర్రలోకి వచ్చేవరకూ. అందుచేత మీ రోగము ఏమిటో తెలియకుండా మీరు మందు ఎలా వాడతారు? అందుచేత మీరు గొడవలు వస్తే రానివ్వండి. కంగారు పడకండి. అవి ఉన్నాయి కాబట్టి వస్తాయి. అప్పుడు మీరు ఏం చెయ్యాలి అంటే ఇవి ఎవరికి వస్తున్నాయి అని ప్రశ్న వేసుకోండి, రానివ్వండి, కంగారు పడకండి, పారిపోవద్దు, ఎస్కేపిజం వద్దు. ఇది యుద్ధం, ధ్యానం అంటే యుద్ధం! మీరు పారిపోవద్దు. ఇది ఎవరికి వస్తోంది అని ప్రశ్న ఎప్పుడైతే వేసుకున్నారో, అప్పుడు ఈ మనస్సు వెంటనే కంట్రోల్లోకి వచ్చి, ఆ తలంపు మళ్ళీ పుట్టింటికి వెళ్ళిపోతుంది. అది మెదడులోకి ఎందుకొస్తుంది అంటే, మేత కోసం వస్తుంది. ఒక మనిషికి మీరు లంఖణాలు కట్టేయండి, ఒక ఇరవై రోజులకో ముప్పై రోజులకో చచ్చిపోతాడు వాడు! కోరికని మనం ఆచరించే కొలదీ దాని బలం పెరుగుతుంది. ఈ కోరికని ఎప్పుడైతే మనం ఆచరణలో పెట్టామో, అది మళ్ళీ హృదయంలోకి వెళ్ళిపోతుంది. తిరిగి మళ్ళీ మెదడులోకి వస్తుంది, ఎప్పుడైతే మనము ఆచరణలో పెట్టమో, అది మళ్ళీ హృదయంలోకి వెళ్ళిపోతుంది. ఈ నేను ఎవడను అనే ప్రశ్న వేసుకొని ఇలా దాన్ని మళ్ళీ అంతర్ముఖం చేస్తున్నామో, నేను ఎవడను అనే ప్రశ్న వేసుకొనేసరికి ఆ తలంపు మళ్ళీ హృదయంలోకి వెళ్ళిపోతుంది. ఎవడైతే స్వార్థం లేకుండా పని చేస్తున్నాడో, ఎవడికైతే తన దైనందిన జీవితంలో స్వార్థంలేని ఆచరణ ఉందో, వాడికి మనోమూలం తెలుస్తుంది. వాడికి మనస్సు నశిస్తుంది. స్వార్థం లేనివాడికి పరమార్థం అందుతుంది. మనోమూలం ఎవడికైతే తెలిసిందో, వాడికే మనస్సు నశిస్తుంది. స్వార్థమే

పరమార్థంగా పెట్టుకున్న వాడికెవడికీ మనోమూలం తెలియదు.

మీకు అనేక సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలనన్నిటినీ సృష్టించేది కల్పించేది మన మనస్సు. ఈ మనస్సు అనే సమస్యని పరిష్కరించుకోవాలనే బుద్ధి మనకి ఎందుకు కలగటం లేదు? రమణమహర్షి ఒకమాట చెప్పారు - ఒక పెద్ద మేధావిని, ఒక పెద్దమనిషిని నువ్వు ఎవరవో నీకు తెలుసా అని అడగండి, వాడు తల వంచుకోవలసిందే. మనకీ అన్నీ తెలుసు. అన్నీ తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తాము. కానీ అన్నీ తెలుసుకుంటున్న ఈ నేను గురించి మనకి తెలియదు. మీకు ఏమనిపిస్తుంది అంటే, మీకేదైనా కోరిక ఉందనుకోండి, ఈ కోరిక నెరవేరిపోతే చాలు, మనకి ఎంత సంతోషం వచ్చేస్తుందో సుఖం వచ్చేస్తుందో అనిపిస్తుంది. ఈ నెరవేరిన కోరిక ఇంకో వెయ్యి కోరికలని తీసుకొస్తుంది. ఇదే మాయ. నాకు కడుపునొప్పి వస్తోంది అనుకోండి, ఏ కారణం వల్ల నాకు కడుపునొప్పి వస్తోంది అని ఆలోచించాలి. దానికి తగినటువంటి చికిత్స నేను చేసుకోవాలి. మీకేదైనా దుఃఖం వస్తూ ఉంటే మీరు దేవుడిని ప్రార్థిస్తున్నారు దుఃఖాన్ని తొలగించమని, మంచిదే, నేను కాదనటం లేదు, ఏ కారణం వల్ల మీకు ఆ దుఃఖం వస్తోంది. ఆ కారణం తొలిగేవరకూ మీకు ఆ దుఃఖం విడిచిపెట్టదు. మీకెవరికైనా దుఃఖం వస్తూ ఉంటే, దానికి కారణం ఉండాలి. ఆ కారణం తొలిగేవరకూ మటుకు ఆ దుఃఖం విడిచిపెట్టదు.

మీరు కేటాయింపులు చెయ్యకండి! కేటాయింపులు అంటే ఏంటి? పొద్దున్న ఒక గంటసేపు పూజ, తరువాత మిగతా ఇరవైమూడు గంటలూ మళ్ళీ లోకం గొడవ. అప్పుడు మైనస్ మార్కులా ప్లస్ మార్కులా మీకొచ్చేది? ఒక గంట దేవుడికి ఇస్తున్నాను, మిగతా ఇరవైమూడు గంటలూ లోకానికి ఇస్తున్నాను, అప్పుడు మీకు వచ్చేది పుణ్యమా పాపమా? అలా కాదు, మీరు పూజ చేసుకుంటే చేసుకోండి, జపం చేసుకుంటే చేసుకోండి, అది కాదు. మీరు ఇరవైనాలుగు గంటలూ జాగ్రత్తగా ఉండాలి. జపం, ధ్యానం చేసుకోండి, కానీ కేటాయింపు కాదు. మీరు ఇరవైనాలుగు గంటలూ కూడా, మీకు వచ్చే తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వారెవరో భీమవరం నుంచి వచ్చారు. భీమవరం నుంచి శృంగవృక్షం వెళ్ళాలి అనే తలంపు వచ్చాక మీరు భీమవరం నుంచి శృంగవృక్షం వచ్చారా, తలంపు లేకుండానే ఇక్కడికి వచ్చి పడిపోయారా? ముందు తలంపు వస్తుంది తరువాత మనం పని చేస్తాము. ఏ పని అయినా సరే, తలంపు వచ్చిన తరువాత పని చేస్తాము. అందుచేత మన పని అంతా దేనిమీద ఆధారపడి ఉంది? తలంపు మీద ఆధారపడి ఉంది. ఆ తలంపుల

విషయంలో మనము ఎందుకు జాగ్రత్త పడటంలేదు. తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉంటే, మనం పని విషయంలో జాగ్రత్తగా ఉంటాము. అంటే తలంపుల విషయంలో అజాగ్రత్తగా ఉంటే, మనం చేసే పనులు కూడా అజాగ్రత్తగానే ఉంటాయి. తలంపుని బట్టి పని ఉంటుంది కాబట్టి తలంపుల విషయంలో కొంచెం ఎక్కువ జాగ్రత్త పడాలి.

అందుచేత ఒక అరగంటసేపు పూజ చేస్తే, ఒక అరగంట సేపు జపం చేస్తే, అక్కడితోటి మన పని పూర్తి అయిపోయినట్టు కాదు. ఇరవైనాలుగు గంటలూ జాగ్రత్తపడాలి. కటోపనిషత్తులో ఏమని చెప్పారంటే, కత్తి అంచుమీద నడిచే మనిషి ఎంత జాగ్రత్తగా ఉండాలో, ఈ ఆధ్యాత్మిక జీవితంలో కూడా అంత జాగ్రత్తగా ఉండాలి. కొంతమంది మాకు మోక్షం ఇంకా రాలేదేంటి, ఇంకా రావటం లేదేంటి అని కంగారు పడతారు. మీరు ఎంత కాలమైనా సరే ఓపిక పట్టాలి. ఇప్పుడు కాకపోతే వెయ్యి జన్మల తరువాత ఇస్తాడు మోక్షం. ఓపిక పట్టాలి. ఈశ్వరుడిని బలవంతం చెయ్యకూడదు. నిరీక్షణ అవసరం. ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన ప్రతివాడికి కూడా ఓర్పు ఉండాలి. ఆ కాలం కోసం నిరీక్షించాలి. తొందర పడకూడదు. ఈశ్వరుడిని బలవంతం పెట్టకూడదు. ఈశ్వరుడిని బలవంతం పెడితే అది శరణాగతి అవుతుందా? అసలు ఈ నేను అనే తలంపు లేకముందూ మనము ఉన్నాము. ఈ నేను అనే తలంపు పోయిన తరువాత కూడా మనం ఉంటాము. శరీరము రాకముందూ మనము ఉన్నాము ఈ శరీరం మరణించిన తరువాత కూడా మనం ఉంటాము. ఇవి మధ్యలో వచ్చాయి అందుచేత మధ్యలో పోతాయి. ఈ నేను అనే తలంపు ఎక్కడినుంచి అయితే పుడుతోందో ఆ పుట్టినచోటు వెదకాలి. వెదికి ఆ పుట్టినచోటు పట్టుకోవాలి. చెరువులో మన వస్తువు ఒకటి పడిపోయింది, మన వస్తువు పడిపోతే ఆ చెరువులో మునుగుతున్నాము, మునిగిపోయిన వస్తువుని మనం బయటికి తెచ్చుకొంటున్నాము. మన వాక్కుని బంధిస్తున్నాము ప్రాణాన్ని బంధిస్తున్నాము, వీటన్నిటినీ బంధించి ఆ చెరువులో మునిగి మన వస్తువుని తెచ్చుకొంటున్నాము. అదేవిధంగా నీ వాక్కుని బంధించి మనస్సుని బంధించి ప్రాణాన్ని బంధించి ఆ నేను అనే తలంపు యొక్క మూలాన్ని నువ్వు తెలుసుకో. మనం చెరువులో పడిపోయిన వస్తువుని వాక్కుని బంధించి ప్రాణాన్ని బంధించి లోపల మునిగి ఆ వస్తువుని ఎలా అయితే తెచ్చుకొంటున్నామో అలాగే నీ వాక్కుని బంధించి మనస్సుని బంధించి నీ ప్రాణాన్ని బంధించి నీ హృదయంలో ఉన్న ఆత్మ ముత్యాన్ని నువ్వు పట్టుకో.

మీరు కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. మీరు ఇంటి దగ్గర చేసుకునే పనే,

పూజతోటి సమానంగా చెయ్యండి. అహంకారం యొక్క విజృంభణ తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. చేతనైనంతవరకూ స్వార్థాన్ని తగ్గించుకోండి. మనం స్వార్థం లేకుండా పని చెయ్యటానికి అలవాటు పడ్డాము అనుకోండి, మనస్సులో ఉన్న మాలిన్యం, మనస్సులో ఉన్న మురికి అంతారాలిపోతుంది. మీరేదైనా మాటలు మాట్లాడేటప్పుడు ఆడంబరం లేకుండా మాట్లాడండి. ఏదైనా రాత రాసేటప్పుడు ఆడంబరం లేకుండా రాయండి. మీరు ఆడంబరం లేకుండా జీవించండి. సమాజంతోటి మీకున్న సంబంధ బాంధవ్యాలు విషయంలో ఆడంబరం లేకుండా ఉండండి. భాషలో నిరాడంబరంగా ఉండాలి. వేషంలో నిరాడంబరంగా ఉండాలి. మాటల్లో నిరాడంబరంగా ఉండాలి. రాసేటప్పుడు నిరాడంబరంగా ఉండాలి, జీవితంలో ప్రతీ చేష్టా కూడా నిరాడంబరంగా ఉండాలి. అదే తపస్సు.

మీరు ఏ పని చేసినా ఈశ్వరుని ప్రీత్యర్థం చెయ్యాలి. లోకం యొక్క మెప్పుకోసం కాదు మనం చెయ్యవలసిన పని, ఈశ్వరుని ప్రీతి కోసం చెయ్యాలి. ఎందుచేతనంటే మన తాళం చెవి ఈశ్వరుని చేతిలో ఉంది. కుండ పైన ఉన్న మూత తీస్తేనేకానీ లోపల అన్నం ఉన్నా కనబడదు. అదేవిధంగా మన హృదయంలోనే సుఖం ఉంది, మన హృదయంలోనే శాంతి ఉంది. కానీ ఈ అహంకారం అనే మూత తియ్యాలి. ఈ అహంకారం అనే మూత తియ్యాలంటే మన ప్రయత్నం ఒక్కటే, మన తెలివితేటలు ఒక్కటే సరిపోదు. ఈశ్వరుడి యొక్క సహాయం ఉండాలి. ఈశ్వరుడి సహాయం ఎప్పుడు వస్తుందంటే, మనం హృదయపూర్వకంగా సాధన చేసినప్పుడు ఈశ్వరుడి యొక్క సహాయం వస్తుంది.

సాధన అంటే ప్రయత్నం, భగవంతుడిని తెలుసుకోవటానికి మనం చేస్తున్న ప్రయత్నమే సాధన. అలా ఎవరైతే హృదయపూర్వకంగా సాధన చేస్తున్నారో, హృదయపూర్వకంగా ఎవరైతే ప్రయత్నం చేస్తున్నారో, వాళ్ళకి ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. మనకి స్వార్థం పెరుగుతూ ఉంటే దేహాత్మబుద్ధి పెరుగుతుంది. మనకి స్వార్థం పెరిగిపోతూ ఉంటుంది అనుకోండి, దేహభావన పెరుగుతూ ఉంటుంది. దేహభావన పెరిగేకొలదీ ఆత్మబుద్ధి నశిస్తుంది. మనకి దేహబుద్ధి ఉంది కానీ ఆత్మబుద్ధి లేదు. అందుచేత మీరు పూజ చెయ్యండి జపం చెయ్యండి ధ్యానం చెయ్యండి, ఏ పని చేసినా సరే దేవుడిని దృష్టిలో పెట్టుకొని చెయ్యాలి. శాంతి సుఖం సంతోషము ఆనందము, ఇవన్నీ ఎక్కడో బయట లేవు. మీ హృదయంలోనే ఉన్నాయి. అవి మనం ఆడంబరాన్ని విడిచిపెట్టిన రోజు మనకి అందుతాయి. స్వార్థం విడిచిపెడితే, ఆడంబరం విడిచిపెడితే మనలో ఉన్న శాంతీ సుఖమూ మనకి అందుతాయి. దైవరాజ్యం మన హృదయంలోనే ఉంది. అప్పుడు ఆ దైవరాజ్యానికి మనం వారసులం అవుతాము.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | | |
|---|---|---|
| డిసెంబర్ | 18 | మధ్యాహ్నం గం॥ 1-00కు భక్తులచే ప్రవచనము |
| డిసెంబర్ | 24 | శ్రీ రమణ జయంతి సందర్భంగా ఉ॥ గం॥ 6-00లకు పారాయణ, ఉ॥ గం॥ 8-00లకు పూజా కార్యక్రమములు, ఉ॥ గం॥ 9-00లకు భక్తుల ప్రవచనము, ఉ॥ గం॥ 11-00లకు అన్న ప్రసాద వితరణ, మ॥ గం॥ 1-00లకు అమలాపురం మాష్టారు ప్రవచనం |

**SRI RAMANA KSHETRAM A/c. No. 51010100649727 3**
**Corporation Bank, Palakol Branch, IFSC Code : CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174**
**For Accomodation : 9849124502, 7780639977**

**మీ 'రమణ భాస్కర' చందా గడువు ఆగష్టు నెలతో ముగిసింది. కావున రెన్యువల్ చందాను స్వయముగాగానీ, యంఓ ద్వారా గానీ కట్టవచ్చును. యంఓ చేయదలచిన వారు శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - 534 265 పేరున రు. 150/-లు పంపగలరు.**

## రమణ సద్గురువు

మహాత్ముడు, మహోన్నత జ్ఞాననిధి, సద్గురువు, అయిన భగవాన్ శ్రీ రమణమహర్షి ది॥ 30-12-1879న అలగమ్మ, సుందరం అయ్యరు పుణ్యదంపతుల ద్వితీయ సంతానముగా తిరుచ్చుళి గ్రామంలో జన్మించారు. భగవాన్ తన 17వ ఏట మధురైలో తన పినతండ్రిగారి ఇంట్లో మధ్యాహ్నం మేడపై పడుకొని ఉండగా, అమృతానుభవమును పొంది, ఋషి అయ్యారు. పిమ్మట 01-09-1879న పవిత్ర అరుణాచలం విచ్చేసారు. అప్పటినుండి 54 సంవత్సరములు జ్ఞాన బోధ చేసి ప్రపంచం నలుమూలల నుండి అనేక మందిని ఆకర్షించి ఆత్మోన్ముఖులను చేసారు. తరువాత కాలంలో మహాతపస్వి, మంత్రద్రష్ట అయిన కావ్యకంఠగణపతిముని భగవాన్‌ను దర్శించి అయ్యా! నేను శాస్త్రములు చదువుకున్నాను, నేను ఎంతో తపస్సు చేసాను, కాని నేను శాంతిని పొందలేకున్నాను, మార్గం చూపండి అని వేడుకున్నారు. భగవాన్ కరుణతో ఇలా అన్నారు, "నేను-నేను అంటున్నావే ఈ నేను ఎక్కడనుండి పుడుతోందో? గమనించి చూడు, మనస్సు అందులో విలీనమవుతుంది అదే తపస్సు. మంత్రాన్ని జపించేటప్పుడు మంత్రనాదం ఎక్కడ నుండి పుడుతోందో? గమనించి చూడు మనస్సు అందులో లీనమవుతుంది అదే తపస్సు" అని ఉపదేశించారు. భగవాన్ శ్రీరమణుల ఉపదేశసారమంతా ఒక్క వాక్యంలో చెప్పాలంటే, నిన్ను నీవు తెలుసుకో! ఇప్పుడు మనకు దేహము నేనుగా అనుభవములో ఉంది. నేను ఎవడను? అను విచారణ ద్వారా మనోనాశనము జరిగి వాస్తవంగా తాను ఎవరో? అనుభవైకవేద్యం అయితే, నది సముద్రములో తన ఉనికిని కోల్పోయినట్లు, దేహపరిమితమైన - నేను అనంతమవుతుంది, తానే బ్రహ్మము. ఆత్మ, నేను, భగవంతుడు, గురువు, మోక్షం, వీటి అన్నిటికి ఒక్కటే అర్థం. భగవంతునికి నిజమైన పేరు 'నేను' అంటారు భగవాన్. నేను ఎవరు? అను విచారణ చేయడం కన్నా గొప్ప కర్మగాని, గొప్ప భక్తిగానిలేదు, అంటారు భగవాన్. ఒక ఉన్నత లక్ష్యం వైపు తక్కువ శ్రమతో కదలాలంటే, గతములో ఆ మార్గములో ప్రయాణించిన మహాత్ముల అడుగు జాడలలో నడవడమే మన కర్తవ్యం. అనేకమంది జిజ్ఞాసువులను అంతిమ సత్యంలోకి మేల్కొలిపి, చివరకు ది॥ 14-04-1950న మహానిర్వాణము పొందారు. ఒక జ్యోతి రూపంలో అరుణగిరిలో ఐక్యమయ్యారు. నేటికి భగవాన్ శ్రీరమణుల సన్నిధి పరమశాంతిని ప్రసాదిస్తూనే ఉంది.

**(దిi 24-12-2018 భగవాన్ శ్రీరమణమహర్షి జయంతి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# క్షీణదశకు రాకుండా ఉండాలంటే మనలో క్రమశిక్షణ అవసరం

భగవంతుని ఇచ్ఛానుసారం నడుస్తూ సుఖదుఃఖాలను సమానంగా చూస్తూ నిర్మలంగా జీవించటమే క్రమశిక్షణ. మన దృష్టి వర్తమానంపై కేంద్రీకృతమైనప్పుడు భవిష్యత్తుకోసం మన ప్రవర్తన దారితీస్తుంది. వర్తమానంలోనే భవిష్యత్తుకు రూపకల్పన జరుగుతుంది. యూదులు కేవలం భగవంతునిపై ఆధారపడకుండా తమ భవిష్యత్తును క్రమశిక్షణతో తీర్చి దిద్దుకోవటంలో చురకైన పాత్రను పోషించి ప్రపంచానికి మార్గదర్శకులైనారు. సాధకుడు సద్గుణాల పట్ల నిశ్చలమైన ఆనందం కలిగి గమ్యం దిశగా పయనించాలి. జీసస్ "చనిపోయిన శవాన్ని చనిపోవటానికి సిద్ధంగా ఉన్నవారు పాతిపెట్టనియ్యండి" అని అంటే దాని అర్థం గతం ఇంకాలేదు చనిపోయింది. ఎందుకు దాన్ని గురించి ఆలోచించటం నెమరువేసుకోవటం మనకు ఏమైనా పిచ్చా! అది మనస్సులో ఉంది. అది ఒక జ్ఞాపకం. ఆ బరువులతో మడతపడ్డ మనస్సు స్వేచ్ఛను పొందలేదు. భవిష్యత్తు ఇంకా పురుడు పోసుకోలేదు. దానిగురించి ఆలోచిస్తూ ఏమి ఏర్పాట్లు చేస్తాము. చేస్తే భంగపడతాము. సంపూర్ణత్వానికి దాని ఏర్పాట్లు దానికి ఉన్నాయి. అది మనకంటే తెలివైనది. గతం గుర్తుకొచ్చినప్పుడల్లా వెనక్కి వచ్చి జాగృతిలోకి రావాలి. అదే క్రమశిక్షణ. ఈ సద్గుణాలను అభివృద్ధి చేసుకోవాలి. నిర్లప్తత, సమత, యుక్తి, ప్రతీ ఒక్కటి. మిగిలిన వాటి వల్ల ప్రభావితమై ఉంటుంది. మన తలంపులను బట్టే శీలం అంటిపెట్టుకొంటుంది. మాటలు మాని నిర్మలంగా ఉండాలి. శ్రీనాన్నగారు "అన్నిదానాల్లోకి నిదానం ప్రధానం, దాన్ని అభ్యసించాలి. ప్రపంచానికి దూరంగా ఉండటం వల్ల రాదు. దీనికీ ఆవేశపడకుండా బుద్ధిబలాన్ని పెంచుకోండి" అన్నారు. సాధకునకు సంతృప్తి కలిగి ఉండాలి. అది నైతిక ప్రవర్తనకు ఆధ్యాత్మిక పురోభివృద్ధికి చాలా ముఖ్యం. తృప్తిగలవారికే ఆశీస్సులు లభిస్తాయి. జాలిస్వభావంతో పాటు ఉదారత కూడా కావాలి. కనికరం గలవాడు పోగొట్టుకొనేది ఏమీ లేదు. సాధకునకు నీతిదాయకమైన జీవనోపాధి కూడా కావాలి. శ్రద్ధాపూర్వకమైన అంకితవైఖరి ఉన్నప్పుడు శుభఫలితాలు వెంటవెంటనే అనుసరిస్తాయి. ఒక్క క్షణమైన అంకిత వైఖరి కుదిరింది అంటే ఎన్నో జన్మల సంచితం కరిగిపోతుంది. సమర్పణా భావంలోనే మనం గతంనుంచి పూర్తిగా విముక్తులమౌతాము. మనం మన దేహాన్ని సుఖాలకోసం విశృంఖలంగా వినియోగించుకోకూడదు. అలా అని దాన్ని నాశనం చేసుకోకూడదు. ఈ దేహం ఒక నివాసస్థలం మాత్రమే అని ఆరోగ్యంగా ఉంచుకోవటం ఎంతో అవసరం. కాలాన్ని సద్వినియోగం చేసుకొనేవారు మహాత్ములు అవుతారు. ఏమి చేస్తున్నాము? ఎలా చూస్తున్నాము. అనేది ముఖ్యం. ఇక్కడ మనకు వారు స్త్రీలా, పురుషులా నల్లగా ఉన్నా వికారంగా ఉన్నా అందంగా ఉన్నా ఏమీ పట్టకూడదు, వారు ఒక మనిషి అంతే చాలు. అంటే ఆత్మపరంగా చూడాలి అని అర్థం. ఇలా చూస్తే సృష్టి మారిపోతుంది. ఈ సత్యాలు మూర్ఖులు విన్నప్పటికీ చెవిటివారుగా వింటారు. జీవితం అనుకూలంగా సాగటానికీ ఈ వేదాంతతత్త్వాలు అన్నీ ఉన్నాయి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**